క్లుప్తంగా

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి


మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

నేరడిగొండ: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. రైతులకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు తీరా రైతులను నట్టేట ముంచుతుందన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచించి రైతులకు వెంటనే రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గాదె శంకర్, గోపి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

స్మృతివనం పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద కొనసాగుతున్న స్మృతివనం పనులను శుక్రవారం ఆదివాసీ నాయకులు పరిశీలించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ నాయకులు కనక తుకారం, ఆర్క ఖమ్ము, ముఖడే ఉత్తం, కొట్నాక్ బారిక్‌రావు, మెస్రం జైరాం తదితరులు ఉన్నారు.

ఘనంగా పూలాజీబాబా ధ్యాన మందిర వార్షికోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న పూలాజీబాబా భక్తులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో శుక్రవారం పూలాజీబాబా ధ్యాన మందిరం 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ధ్యాన మందిర ఆలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. ముఖరా(బి) మాజీ సర్పంచ్ అడప్ మారుతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని యాపల్‌గూడ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్లాస్టిక్ భూతం నుంచి విముక్తి ఎలా పొందాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో ఆనంద్, ప్రధానోపాధ్యాయుడు ముజాఫర్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌వి దొంగ ధర్నాలు'

నేరడిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న దొంగ ధర్నాలను రైతులు పట్టించుకోవద్దని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నియోజకవర్గ నాయకులు, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదన్నారు. పార్టీ జిల్లా నాయకులు ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, పసుల చంటి, రాజు యాదవ్, వసంత్‌రావు, జనార్దన్, శంకర్, సంజీవ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి..

నేరడిగొండ: నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయన 45వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో ఘనంగా నిర్వహించారు.

జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలు దాటినా ఖాళీగా కన్పిస్తున్న కుర్చీలు



ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయంలో..



కలెక్టరేట్‌లోని సీసెక్షన్‌లో ఉద్యోగులు లేక ఖాళీగా కుర్చీలు



సమయ'పాలన' ఇదేనా..?

జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువైన కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10.30 గంటలు దాటినా విధులకు హాజరు కావడంలేదు. మధ్యాహ్నం లంచ్ సమయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. విధులకు ఆలస్యంగా వచ్చే వారు ఇంటికి మాత్రం 5 గంటల కంటే ముందుగానే వెళ్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వివిధ పనుల కోసం వచ్చే వారు ఉద్యోగులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


మాట్లాడుతున్న సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లాఖాన్

నేరడిగొండ: మత్తు పదార్థాల బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా ఖాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయదృక్పథం పెంపొందించుకోవాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ సరస్వతి

ఇచ్చోడ: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పొంపొందించుకొని దేశ భవిష్యత్తు కోసం పాటుపడాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సరస్వతి అన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం ఉపన్యాస పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుపతి, మధు, సరితారాణి, మురళి, టి.నర్సయ్య, ప్రభత్ రావు, విజయ్‌కుమార్, దివాకర్, సృష్టి, సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జైనథ్: విద్యార్థులు చిన్న వయసు నుంచే అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోధ్యాయులు శశికళ సూచించారు. శుక్రవారం పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు తయారు చేసిన చంద్రయాన్ నమూనా మాడ్యూల్స్, రాకెట్‌లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు అభవ్ కుమార్, రఘు, రమణ, అనిత, మాధురి, జయకర్ పాల్గొన్నారు.

ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్


శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఉట్నూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా రొడ్డ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనను ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ కమిషనర్ కృష్ణ ఆదిత్య శుక్రవారం ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉట్నూర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రమేశ్‌బాబు ఇటీవల జరిగిన బదిలీల్లో వనపర్తికి బదిలీ అయ్యారు.

ఆశ్రమ పాఠశాలల్లో దోమల నివారణ చర్యలు


పాఠశాలల్లో మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో దోమల నివాణకు ఫాగింగ్ స్ప్రే కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏటీడీవో క్రాంతి పేర్కొన్నారు. దోమలు వ్యాపించి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఒక్కో ఏటీడీవో పాయింట్‌కు రూ. కోటి విలువ గల మొత్తం 8 ఫాగింగ్ మిషన్‌లను సరఫరా చేశామన్నారు. వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో ఫాగింగ్ పూర్తి చేసే విధంగా ప్రణాళికలు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

పీఎం జన్‌మన్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దొంగచింత గ్రామంలో పీఎం జన్‌మన్ ప్రభుత్వ పథకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీవీటీజీ తెగలకు చెందిన వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధార్‌కార్డులో తప్పులు సవరించడం, సమస్యల పరిష్కారం, బ్యాంకు ఖాతాలు తెరవడం, అర్హులైన లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ నమోదు, పీవీటీజీ కమ్యూనిటీ సర్టిఫికెట్ల జారీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలు, సికిల్‌సెల్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించారు. పీవీటీజీ ఏపీవో మనోహర్, జేడీఎం నాగభూషణం, గ్రామస్తులు పాల్గొన్నారు.


కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం

తాంసి: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులతో కలిసి ఐక్య పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మల్లేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో తాంసి, భీంపూర్, తలమడుగు మండలాలకు క్యాడర్ క్లాసులు నిర్వహించారు. వెంటనే కార్మికులను ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సహాయ కార్యదర్శి వెంకటమ్మ, జిల్లా నాయకులు అగ్గిమల్ల స్వామి, దోనిపెల్లి స్వామి, విలాస్, శ్రీనివాస్,అంగన్‌వాడీలు ప్రమీల, సరిత, విజయ తదితరులు ఉన్నారు.

నేడు ఇచ్చోడలో ఆయుష్మాన్ ఆరోగ్యశిబిరం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి కాళ్లనొప్పులు, కీళ్ల నొప్పులు, దగ్గు, దమ్ము, మలబద్ధకం, అర్శమొలలు, జీర్ణవ్యవస్థ, బీపీ, షుగర్ వ్యాధులను నిర్ధారించి ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరానికి వచ్చే వారు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు



అవగాహన కల్పిస్తున్న సీఐ మొగిలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉట్నూర్ సీఐ మొగిలి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ర్యాగింగ్ చేసిన, డ్రగ్స్ సేవించినట్లు తెలిసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, అధ్యాపకులు సాయి ప్రసాద్, రాణి, నర్సింగ్‌రావు, ఏఎస్సై దిలీప్, పీడీ అనిత, విద్యార్థులు ఉన్నారు.

జెడ్పీ సీఈవోను కలిసిన సంతోష్‌రెడ్డి

తాంసి: ఆదిలాబాద్ జెడ్పీ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన గోపిడి జితేందర్ రెడ్డిని శుక్రవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తాంసి మండలంలో నెలకొన్న పలు సమస్యలను జెడ్పీ సీఈవోకు విన్నవించారు.

మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జి.జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు గిమ్మ సంతోష్, అల్లెట్టి నాగన్న, అల్లాబకాష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన కార్యాలయంలో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ

తాంసి: ప్రతీ వాహనదారుడు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై శివరాం అన్నారు. శుక్రవారం సాయంత్రం సిబ్బందితో కలిసి మండలంలోని వడ్డాడి ఎక్స్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు, లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. సిబ్బంది సంతోష్, స్వామి, భాస్కర్ ఉన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన


మాట్లాడుతున్న వెంకటరమణ

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి, సీపీవో వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి బోధన తీరు, అందిస్తున్న భోజనం, సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి, ఆర్సీవో గోపిచంద్, ప్రిన్సిపాల్ అసుమతి ఉన్నారు

ఎస్సైకి సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: మండలానికి ఎస్సైగా బదిలీపై వచ్చిన ప్రవీణ్‌ను కాంగ్రెస్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం వేర్వేరుగా సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు గొర్ల రాజు యాదవ్, అబూద్, మహమ్మద్, పోశెట్టి, భోజన్న, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు వెంకటేశ్, ప్రవీణ్, రమేశ్, భూమన్న, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


ఇచ్చోడ: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనిల్‌జాదవ్

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని ఇస్పూర్ గ్రామంలో శుక్రవారం నూతన హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు చేపట్టడంతో దైవభక్తి నెలకొంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా దైవనామస్మరణతో ఆధ్యాత్మికం వైపు పయనించాలని సూచించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, రమేశ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగు అనువాద పుస్తకం ఆవిష్కరణ

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన రచయిత గురుదాస్ మిట్టపల్లి శంకరయ్య రచించిన హరిపాఠం తెలుగు అనువాద పుస్తకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంత్ శ్రీజ్ఞానేశ్వర్ మహరాజ్ సుమారు ఏడు వందల ఏళ్ల క్రితం రచించిన హరిపాఠం పుస్తకాన్ని గురుదాస్ శంకరయ్య తెలుగులో అనువదించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శంకరయ్య పాల్గొన్నారు.

'మహిళా సాధికారత దిశగా కేంద్రం కృషి'


పార్లర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

జైనథ్: మహిళా సాధికారత సాధించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మహిళా శక్తి డెయిరీ పార్లర్‌ను, మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించడం లేదన్నారు. ఎమ్మెల్యేగా మహిళా సంఘాల అభివృద్ధికి ఎల్లవేళల తోడ్పాటు అందిస్తానన్నారు. తహసీల్దార్ శ్యాంసుందర్, మహిళా సంఘాల సభ్యులు, బీజేపీ నాయకులు విజయ్, అస్టక్ సుభాష్, అశోక్ రెడ్డి, ప్రతాప్, విశాల్, ఆదినాథ్, రాజు, మురళీధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బేల: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ బోయర్ తిరుపతితో పాటు పలువురికి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, అన్నీ గ్రామ పంచాయతీల్లో బీజేపీ అభ్యర్థులే భారీ మెజార్టీతో గెలిచేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ జిల్లా నాయకులు బోయర్ విజయ్, దత్తా నిక్కమ్, తాక్రే మురళీధర్, మోరేశ్వర్, గణేశ్, సందీప్, రాము, శివకుమార్, నవీన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

'బదిలీ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి'


మాట్లాడుతున్న మాదిగ సంక్షేమ సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలోని (జైనథ్) మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న మాదిగ జాతి మహిళా ఉద్యోగి సంగీత బదిలీ ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మల్యాల మనోజ్ మాదిగ, గాలిపెల్లి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆమెపై మత తత్వ విద్యార్థి సంఘాల నాయకులు చేస్తున్న విమర్శలను మాదిగ సంఘం ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కలెక్టర్ స్పందించి ఆమె బదిలీ ఉత్తర్వులు రద్దు చేయాలన్నారు. సంఘం నాయకులు సంజయ్, గంగాధర్, ప్రభాకర్, శివకుమార్, దేవిదాస్, రాందాస్, ప్రసన్న, చంటి, నరసింహులు, రవి, స్వామి, బారిక్‌రావ్, విలాస్, సుందర్ తదితరులు ఉన్నారు.

నిశ్చితార్థ వేడుకలకు 'కంది'


సీఎం రేవంత్‌రెడ్డితో కంది శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

కైలాస్‌నగర్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల జగదీష్ రెడ్డి కుమార్తె రుత్విక వివాహ నిశ్చితార్థ వేడుకలు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగాయి. ఈ వేడుకలకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి తన సతీమణి సాయిమౌనరెడ్డితో కలిసి హాజరై రుత్విక- అభిజిత్‌లను ఆశీర్వదించారు. అనంతరం వేడుకలకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.

బాధితురాలికి ఆర్థిక చేయూత


నిషాతో మాట్లాడుతున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న జైనథ్ మండలం పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన మ్యాకల నిషాకు మావల మండలంలోని టీచర్స్ కాలనీకి చెందిన సామాజిక వేత్త ముడుపు మౌనిష్ రెడ్డి అండగా నిలిచారు. నిషాకు వైద్య చికిత్స కోసం తన వంతుగా ఆర్థిక చేయూత అందజేశారు.

డీఎంహెచ్‌వోను కలిసిన వైద్యాధికారులు


కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కృష్ణను ఆయా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయనను శాలువతో సత్కరించారు. ఆయన జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్లు వంశీ, శ్యామ్, హరీశ్, స్వామి, సుచల, నైనత, రాజవాణి, సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.